# తెప్ప తిరునాళ్ళు

శ్రీమతి అయ్యగారి రామమ్మ

అవి శేషసురోజులు. 'పండనిచోట్ల అనేక ప్రజలు నకనకలాడుతూంటే పండినోళ్ళ నోట్లో మట్టి గొట్టి పట్టుకుపోతామంటున్నారు గవర్నమెంటోరు; ఇదేం అన్యాయం బాబూ" అంటూ గోల పెట్టారు రైతులు గ్రామాధికారి సూరయ్యగారివద్దకు వచ్చి.

సూరయ్యగారు కొంచెం ఆలోచించారు. నిజమే మరి; ఇదివరకోసారి కుటుంబానికి సరిపోయినవి పోగా మిగిలినవి గవర్నమెంటు కివ్వమంటే ఆ వెట్టి బాగులరైతులంతా అలాగే అర్పించారు. దగ్గరుండి యిప్పించిందితానే. మళ్ళీ యిప్పుడున్నంతలో తలో రెండు బస్తాలు, అసమం ఒక్క బస్తా అయినా తెమ్మంటే ఎలా యిస్తారు? గంపెడు సంసారాలు, కబుర్లంటే చెప్పొచ్చునుగాని ఒక్కపూటైనా కూడు లేకుండా గడపడం ఎంతకష్టం:—'సరే లెండి నే చెబుతాను వెళ్ళండి' అన్నారు సూరయ్యగారు.

మర్నాడు ఇనస్పెక్టరుగారు వచ్చారు. ధాన్యపుగాదులన్నీ పరిశీలించారు. రైతుల కాయేడాదికి తిండికికూడా రెండు నెల్ల గ్రాసం తక్కువగా కనిపిస్తోంది, ఏ గాది చూచినా. ఇనస్పెక్టరు తెల్లబోయి వెళ్ళిపోయాడు.

మరునాడు రైతులంతా అనుకోకుండా సూరయ్యగారింటికి అందరూ తలొక ధాన్యపు బస్తా తీసుకురావడం ఆయన్ని ఆశ్చర్యపరచింది. అలా యివ్వలేని వాళ్లు ఏవో అపరాలు తమ శక్త్యానుసారం తీసుకొచ్చారు.

'ఇవన్నీ యెందుకు?' అన్నారాయన.

'ఎందుకేంటండి బాబూ ఇంతకంటె మీ ఋణం ఎలా తీర్చుకోగలం; అందరిలాగా మీరుకూడా అధికారుల్లో గొప్పలు పొందాలని పట్టి మమ్మల్ని వేధించుకు తింటే మేమేం చెయ్యగలం; మీధర్మమా అంటూ మన ఊరంతా పచ్చగా వుంటుం దీయేడు; కడుపునిండా కూడు తింటాం. 'ఇంట్లోనే మీ కొక్కవలసినవి అటకలమీద పాత్తిపెట్టుకోండి' అని మీరుచెప్పక పోతే మాకు దిక్కూ మొక్కూ బాబూ: మీరు ధరమరాజులు' అంటూ పట్టుకొచ్చినవి దించారందరూ.

'నాకెందుకు; ఇవన్నీ: నాలాటి వాళ్ళు మీరంతా బతకాలని నేచెయ్యవలసింది చేశానంతే: తీసుకెళ్ళండి: అన్నారాయన.

'కాదుబాబూ! తమలాంటోరి కడుపులో పడితే మా కష్టానికి ఫలితం బాబూ: మీఋణం తీర్చలేం; అంటూ మోసుకొచ్చినవి ఇంట్లో పడేసి వెళ్ళిపోయారా రైతులు;

'పిచ్చివాళ్ళు' అనుకున్నారు సూరయ్యగారు.

ఆవేళ ఊరంతా కోలాహలంగా ఉంది; ఎవరికి వాళ్ళున్నంతలో కొత్తబట్టలు కట్టుకుని నగలు లేకపోతే ఎరువేనా తెచ్చి సింగారించుకుని దేవాలయానికి దారితీస్తున్నారు. పిల్లలసందడి చెప్పనక్కరేదు. ఆడపిల్లలు రంగు రంగుల పరికిణీలతోటీ జాకెట్లతోటీ సీతాకోక చిలకల్లా ఆడుకుంటూ పాడుకుంటూ వస్తున్నారు. మగపిల్లలు చిన్న చిన్న బూరాలు బాకాలూదుకుంటూ వస్తున్నారు. గుళ్ళోరాం ఢోలు మేళాలు మారుమ్రోగుతున్నాయి.

ఆచార్లవారు పట్టె వర్ధనాలు మొగాన తీర్చి దిద్దుకొని బిళ్ళగోచీపెట్టి పంచెలు కట్టుకొని నడుముకు కండువాలు చుట్టుకుని గర్భాలయంలో హడావిడిగా గట్టిగా మంత్రాలు చదువుతున్నారు. జనం గర్భాలయం ముందుభాగంలో నుంచుని శ్రద్ధగా చెవులొగ్గి మంత్రాలు వింటూ దేవుడివేపు చూస్తున్నారు. స్త్రీలంతా అచ్చటనే బొగడచెట్టు క్రిందా పొన్నచెట్టు క్రిందా కూర్చుని మాటామంతీ చెప్పుకుంటున్నారు.

పన్నెండు సంవత్సరాల విమల కిది అంతా ఆశ్చర్యంగా తోచింది. ఆమెకీ కోలాహలం, దేవుని ఉత్సవాలు చాలా ఆనందాన్ని కల్గించాయి. ఏటా జరుగుతూన్నదే అయినా జ్ఞానం వచ్చిన తరువాత యింత చక్కని ఉత్సవాలను ఆమె చూడలేదు. ఈ యేడామెకా వాతావరణమంతా క్రొత్త భావాలని కలగజేస్తూంది.

సాయంత్రం కాగానే ప్రతిగుమ్మం ముందూ ముత్యాలతో తీర్చిదిద్దినట్లు ముగ్గులు వెన్నెల్లో మిలమిల లాడుతూంటాయి. ఆ ముగ్గులమీదుగా దేవుడు ప్రంగుమ్మంలోనూ భక్తితో గృహస్థులర్పించిన పళ్ళనూ, పూలనూ పూజారిరూపంలో తీసుకుపోతూంటాడు.

విమల కావేళ తన గుమ్మం ముందు కూడా చక్కని ముగ్గులతో అలంకరించడం, దేవుడికి పళ్ళివ్వడం సరదా, సంతోషం కలిగించాయి. నిజమైన భక్తి దేవుడంటే ఏమిటో కూడా ఆనాడే ఆమె పన్నెండేళ్ల జీవితంలోనూ తెలుసుకో గలిగింది. చిన్నప్పుడామెను పెద్దవాళ్లు "దేవుడికి దణ్ణం పెట్టమ్మా! గోపాలకృష్ణుడులాంటి మొగుడొస్తాడు' అంటే 'ఈ బొమ్మలకుకూడా పెళ్ళిళ్ళు చేస్తారా!' అనుకొన్న రోజులున్నాయి. కాని యీ వయస్సులో యీ వినోదాల్లో మాత్రం దేవుడంటే ఆమెకు చాలా భక్తి శ్రద్ధా కలిగాయి. దేవుడానంద స్వరూపుడనుకుంటూ మనసారా నమస్కరించింది.

మరునాడు తెప్పతిరునాళ్ల ఉత్సవం... సాయంత్రం స్త్రీలందరూ, పట్టుబట్టలూ, మడివస్త్రాలూ ధరించి ఒక చేత్తో పూజకు చెంబులూ, రెండో చేత్తో పూలసజ్జలూ పట్టుకొని కోనేరు దగ్గఱకు వస్తున్నారు. ప్రక్కనే నుంచున్న విమల "అమ్మా! తెప్పతిరునాళ్ళంటే ఏమిటమ్మా" అని అడిగింది తల్లిని.

'చూడూ! అడుగో వస్తున్నాడుగా దేవుడు' అంది వాళ్ళమ్మ. మరుక్షణంలో మహారాజులా ముందు మేళాలు మ్రోగుతూంటే ముత్యాలగొడుగు ధరించి గరుడ

వాహనంమీద వేంచేశాడు పెరుమాళ్ళు. మేనాలో అమ్మవారు దిగింది. గబగబా నౌకర్లు మూడు పీపాలు దగ్గర చేర్చికట్టి చెరువులో వదిలారు. అది ఆ నీళ్ళలో తెప్పలా తేలుతోంది. దేవుడిని కూడా అమ్మవారి పల్లకీలో చేర్చి నెమ్మదిగా ఆ పల్లకీని తెప్పమీద చేర్చ ప్రయత్నంలో ఉన్నారు పూజార్లంతా! ఈ ఉత్సవం చూడటానికి పల్లె అంతా చెరువుగట్టుకు తరలివచ్చింది. స్త్రీలూ, పురుషులూ, పిల్లా, పెద్దా వివక్షత లేకుండా అందరూ దేవుడి పెళ్లికి పెద్దలయారానాడు. ఎవరి సందడివారిది.

విమల యీడు పిల్లలలో ఆ పల్లెటూళ్లో చాలా భాగం పెళ్ళిళ్ళయిపోయాయి' నిజంగా ఆ వయస్సుదాకా విమలకు పెళ్లిచేయకుండా అలా ఉంచడం వాళ్లందరికీ ఆశ్చర్యంగానే ఉంది. ఆమెతోటి పిల్లలందరూ మడిబట్టలు కట్టుకుని దేవుడికి దీపాలు పెట్టడానికి వచ్చారు.

ఒక వృద్ధస్త్రీ విమల తల్లిని "ఏమమ్మా! దేవుడి పెళ్ళి కూడా అయిపోయింది మరి మీ అమ్మాయి పెళ్ళెప్పుడూ?" అని అడిగింది.

వెంటనే అందుకుని యింకోకామె 'ఏటా జరుగుతూనే ఉంటుందిగా దేవుడు పెళ్లి' ఈయేడు కాకపోతే మళ్ళీయేడు..' అంది.

"ఏమో యింటావంటా లేని ఆచారం పెళ్లయితే చాలుననుకొని తాటాతూటంగా ముడిపెట్టేశాం మా అమ్మాయికి - నలుగురి నోళ్ళలోనూ పడతామా" అంటూ బుగ్గలు నొక్కుకుంది మరో ఆమె.

"మేం పిల్లలకు చదువూ సంధ్యా అంటూ చెప్పించలేదు సుమండీ: ఏదో పూర్వాచార ప్రకారం మాహారేదో ఆడపిల్లలకెనిమిదేళ్ళొచ్చేటప్పటకి పెళ్లిచేసెయ్యాలంటారు." అందింకో ఆవిడ.

'అయితే పదేళ్ళొచ్చేదాకా ఎందుకుంచుకున్నావమ్మా' అందిఒకామె.

'బాగుంది చావమన్నావా యేమిటి: ఎక్కడా కుదరకపోతే.'


'అందరికీ అంతేనమ్మా; కుదిరేదాకానే చూస్తూంటారు; పెళ్ళి చెయ్యకుండా యింట్లో కూచోపెట్టుకుందామని యెవరూ అనుకోరు '

వీరందరికీ సమాధానాలు చెప్పలేక కష్టంగా ఉన్నా. 'అందరికీ అంతేనమ్మా' ఎక్కడా సంబంధం కుదరక చూస్తున్నాం అంది విమల తల్లి పార్వతమ్మగారు.

ఇంతలో దేవుడు దేవితో గూడి తెప్ప మీదికి రావడం, తెప్ప బయలుదేరడం కూడా జరిగాయి. పూజారి దేవుడితో పాటు తెప్పమీద కూర్చుని మంత్రాలు వల్లె వేస్తున్నాడు. మేళాలు గట్టుమీద నుండి దేవుడితోపాటు బయల్దేరాయి. మగవాళ్ళంతా దేవుడితోపాటు చెరువుగట్టువ ప్రదక్షిణం చేయడానికి బయలుదేరారు.

వెంటనే స్త్రీలందరూ ఒక్కొక్కరే చెరువుగట్టుమీద కూర్చుని తాము నేతితో తడిపి అరిటాకు దొన్నెలతో తెచ్చిన దీపాలను వెలిగించి తెప్పవెనకాలే వదిలారు.

దేవుడు బయలుదేరిన ఆ జలవిహారంలో వెనకాలే ముత్యపు తెప్పల్లా బయలుదేరే దీపాల వరుసలు చూస్తూంటే కన్నులవైకుంఠం అక్కడే ఉందా, అనిపిస్తోంది. ఆ సమయాల్లో మానవ హృదయాల్లో కష్టసుఖాలూ రాగద్వేషాలూ మాయమయ్యాయి అందరి కళ్ళు ఆ



కాలువగట్టు

ఫోటో— శ్రీ జి. ఎస్. భూషణ్.

# ★ తెప్పతిరునాళ్లు ★

దృశ్యంమీదే లీనమైనాయి. 'ప్రత్యక్ష దైవం అంటే ఇతడే' అనుకున్నారు పల్లీయులంతా... భక్తితో దూరాన్నుండీ అందరూ ఒక్కమారుగా చేతులుమోడ్చి నమస్కరించారు.

విమల కిది జన్మలో మరిచిపోలేని ఆనందంగా తోచింది. వాళ్లమ్మ నడిగింది 'అమ్మా! నాకొక్క దీపం ఇవ్వవూ! నేను కూడా వదిలిపెడతాను.'

"పెళ్ళికానివాళ్లు చెయ్యకూడదమ్మా" అంది తల్లి.

"రావే అనూ! దేవుడు బయలుదేరేముందుఆయన వెనకాలే దీపాలు వదిత్తే యెంత పుణ్యం అనుకున్నావు! అయిదో తనం పూర్తిగా నిలుస్తుంది." అని యెదురుగుండా ఒక తల్లి తనకూతురుచేత దీపాలు పెట్టిస్తోంటేవిమలకు చాలా సరదా వేసింది. 'ఏంతనేం తప్పుచేసింది; పెళ్ళికానివాళ్లు పూజలు చెయ్యకూడదా!' ఈప్రశ్న ఆమెను బాధించింది.

ముమ్మారు చెఱువుచుట్టూ కూడా వచ్చేపరివారంతో తిరిగి ఒడ్డుకు చేరుకున్నాడు దేవుడు. పూజారి మళ్ళీ వాహనాల్లో దేవుడినీ ఆయన దేవేరినీ కోవెల్లోకి తీసుకుపోతూంటే ముందు మేళాలు, వెనక పరివారమూ ఆయనను కొలిచి వెడుతున్నారు.

ఉత్సవం ఆయిపోయిన తరువాత పసిపిల్ల బాలాదీ అందఱూ గుళ్ళోకి వెళ్ళి దేవుడికి పువ్వులూ, ఫలాలూ సమర్పించి ప్రసాదం పుచ్చుకుని వెళ్లిపోయారు.

విమలమాత్రం తిన్నగా యింటికే వెళ్ళిపోయింది. "ఏం! పెళ్ళికానంతమాత్రాన తనపూజకే అంగీకరించని దేవుడు తను ప్రసాదాన్ని పుచ్చుకోడానికి మాత్రం అంగీకరిస్తాడా: అయినా దేవుడేం చేస్తాడు; ప్రత్యక్షంగా వచ్చి చెప్పేడా! ఇలాటి కట్టుబాట్లను పెట్టిన వాళ్ళననాలి" ఈ ఆలోచనలతో ఆమెకు రాత్రి నిద్ర కూడా పట్టలేదు.

పట్నవాసపు వాసనలింకా అట్టేసోకనిపల్లెటూరది. సూరయ్యగారా పూరికి గ్రామాధికారి. ఆయనపిల్లల్లో పెళ్ళికెదిగినపిల్ల విమల. భారీగా అందరిలాగా పెళ్లిచేయడానికాయ నేమంత సంపన్నుడుకాడు. అయినా నూతనాశయాలు గలవాడు. ఊళ్ళోపిల్లలు చదువుకోవాలంటే రెండుమైళ్ళు నడిచి వెళ్లాలి. ఆడపిల్లయినా చదివించాలనే సరదా కొద్దీ ఆయన తనకూతురిని అంతదూరం పంపి చదివించేవాడు. ఆయన అలా చదివించడం అందరికీ ఆశ్చర్యంగా ఉంది. 'ఆడపిల్లలకు కూడా చదువుచెప్పిస్తే సంసారాలు జరగడమెలాగయ్యా;' అని అడిగిన మహానుభావులుకూడా లేకపోలేదు.

కాని అంత ఉత్సాహంతో కూతురికి చదువు ప్రారంభించిన సూరయ్యగారు మళ్ళీ ఆరీతిగానే ఆ చదువుకు స్వస్తి చెప్పారు.

కూతురంది 'నాన్నా నేను స్కూలు ఫైనలయేదాకా నైనా చదువుకోవద్దా!' అని.

'వద్దమ్మా; మనం సాంప్రదాయ కుటుంబంలో వాళ్ళం, వచ్చిన చదువు చాలు. ఇక పెళ్లిచేస్తే నాబరువు తగ్గుతుంది.'

మనస్సులో ఎంత కుతూహలమున్నా మరలించుకోక తప్పిందిగాదు విమలకు.

తొమ్మిది గంటలకు బడికి బయలుదేరిపోయి నాలుగున్నరకింటికివచ్చి స్కూల్లో పాఠాలన్నీ చదువుకొనేటప్పటి కెక్కడా తీరికుండేదిగాదు విమలకు; పిల్లలందరితోటీ కలిసి ఆడుతూ, పాడుతూ, చదువుకోడం...మంచి మార్కులు తెచ్చుకొని అందరిచేత మెప్పించుకోడం ఆమె జీవితంలో బాగా అలవాటుపడింది. స్కూలునుండి యింటికి వస్తుంటే పచ్చనిపొలాలూ, పచ్చికబీళ్ళు, పళ్ళతోటలూ ఆ ఊరిసమీపంలో చాలా బాగుండేవి. వాటి నన్నిటినీ చూచే ఆమె చిత్రకళ నభ్యసించింది.

ఇప్పుడామె కేమీ తోచటంలేదు. పొద్దుగడవడమే కష్టంగా ఉంది. ఆమెకంతా శూన్యంగా కనిపిస్తోంది. మునుపటి పాఠాల్లేవు; పాటలు లేవు; ఆటల్లేవు. ఆ శూన్యవాతావరణంలో తెప్పతిరునాళ్ల ఉత్సవాలామెకు చాలా ఆనందాన్ని కల్గించాయి. కాని దేవుడిని మనసారా పూజించుకునే హక్కామెకు సంఘం ఇవ్వలేదు.

యుద్ధకాలంలో కలిగినవాళ్లకే సంసారాలు గడవడం కష్టంగా ఉంది. సూరయ్యగారివంటి మధ్యరకపు సంసారాలకు వేరే చెప్పనక్కర్లేదు. అయినా యెటువస్తే అటు వెళ్లి నాలుగుచేతులా సంపాదించే తెలివితేటలూ ఆయనకు లేవు. గ్రామాధికారిగా ఆయన రైతులకి చాలా సహాయపడ్డాడు. సూరయ్యగారి మూలంగా బ్రతికామనుకునే రైతు జనం చాలామంది ఉన్నారా వూళ్ళో. నాడు జరిగిన సెరఘుటనల్లాంటి వాటి కొన్నిటికో ఆయన వాళ్లకు చేయూతనిచ్చాడు.

కాని ఆయన కుటుంబానికి సాయపడేవాళ్లు మాత్రం యెక్కడా కనుపించరు. అదీ గాకుండా కూతురి పెళ్ళి ఆయనకో కొండలా ఉంది. ఆయన కేమీ తోచటంలేదు. చివరికి బంధువులనేవారు: 'ఏదో ఒకటి అయిందనిపించుకోవాలి గాని యెందాకానయ్యా! పోనీ ఆ చదువేనా పూర్తిచేశావా! అది కూడా మానిపించుకు కూచున్నావు! పెళ్ళి పెళ్ళంటే యెలా అవుతుంది? పెద్దమాట కావాలి!'

ఆవేళ మామిడితోటలో వనసంతర్పణ. ఆడవాళ్లు మొగవాళ్ళు కూడ వేరువేరు పంక్తుల్లో చెట్లక్రింద భోజనాలకి కూర్చున్నారు. భోజనాలదగ్గఱ లోకాభిరామాయణం...





రత్నపురుషవేషం

సువర్ణము, ఔషధులు కలిపి తయారుచేయబడినది. శుక్లనష్టము, గుండెదడ, నరముల బలహీనము అతిమూత్రము మొ॥ మేహ వ్యాధులను హరించును. బలమును, కాంతిని, ధాతుపుష్టిని, యిచ్చును అనేక యోగ్యతా పత్రాలు కలవు డబ్బా రు. 3-12-0 వి. పి. ఆ. 14.

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు - విజయవాడ-2.

'ఈవేళ పరమాన్నం చాలా బాగుందండీ'


'వంకాయకూర భేషుగ్గా ఉంది...'

'పెరుగు ఎక్కడ తెప్పించారో కాని మహా బాగుందండీ'......'అయినా యీ దిక్కుమాలిన కాఫీహోటళ్లు వచ్చిన తరువాత పల్లెటూళ్లు కూడా పాడవుతున్నాయి. నా చిన్నతనంలో ఈ ఊళ్లో పాలు పెరుగూ అమ్ముకోడం ఎరగరండీ మన బోటివాళ్లం అడిగితే, ఇప్పుడా భక్తి లేదు; ఆ రుచీ లేదు'

(43-వ పేజీ చూడండి)

# మీరు ఖర్చుపెట్టిన డబ్బుకు ఈవిధములుగా డాల్డా వనస్పతి పూర్తిగా లాభము గలుగజేయును




మాంసమును తినుట ఆవశ్యకమా ఉచిత సలహాకు ఇవ్వాళో లేక ఏ రోజైనను ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి;
ది డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్ట్ బాక్స్ నంబరు 353, బొంబాయి 1

జయము పొందడానికి ఆటగాండ్రు మాత్రమే ఆరోగ్యకరముగా నుండాలని లేదు—మన మందరికి ఆరోగ్యము మరియు శక్తి ముఖ్యము. మీ కుటుంబమునకు తప్పకుండ నుండాలని డాక్టర్లచే చెప్పబడు శక్తినిచ్చు క్రొవ్వుపదార్థమును మీ కుటుంబము పొందేటట్లు తప్పకుండ చూడండి. అందుకై డాల్డాతో మీరు వండేటట్లు తప్పకుండ చూడండి.

## డాల్డా




**ఆరోగ్యకరముగానుంచే వంట క్రొవ్వుపదార్థము**

HVM. 186-X52 TL

(25-వ పేజీ తరువాయి)

'మనుషులతో పాటే అదీ లెండి' అన్నాడు నవీనాచారాల్లో అడుగు పెట్టిన ఒక ఘరానా పెద్దమనిషి.

అయితే యేమిటీ సూరయ్యగారు కూతురికి పెళ్లి ఈ యేడైనా చేస్తారా! అనిఒకాయన ప్రశ్న."

"ఏమో మొన్న నే నేదో రెండో సంబంధం చెబితే "పిల్ల పాదం పెడుతూనే సవితికి తద్దినాలూ శార్ధాలూ పెట్టాలా" అంటూ పెదివి విరిచారు. ఇదేం మొగపిల్లాడండీ! మనకి కావలసింది తెచ్చుకోడానికి..."

"ఆఁహా! అదేమిటండీ; తద్దినాలూ శార్ధాలూ యేడాదికొక్కసారేగాని యెప్పుడూ వస్తాయా యేమిటి? అయినా యేమిటి! ఆయ నివాళ వనసంతర్పణకి రాలేదు."

"ఆయ నేదో ఊరికెళ్లారటండీ పనిమీద"

ఆడవాళ్ళ పంక్తి అంతా కలకల్లాడుతూ చాలా బాగుంది. ఆ ఊళ్ళో ఎవరెలా ఉన్నదీ పసిపిల్ల బాలాదికీ కంఠోపాఠమే. సూరయ్యగారి భార్యా కూతురూ ఆ సంతర్పణకి రాలేదనేది వాళ్లు తెలుసుకోడానికెంతోసేపు పట్టలేదు.

"అదేమిటమ్మా! పార్వతమ్మగారూ కూతురూ కూడా రాలేదు."

"కూతురి పెళ్ళయితేనేగాని ఆమె యెక్కడికీ రాదల్చుకోలేదేమో!"

"అదేమిటమ్మా! పసుపూ కుంకాలకి పదామడల దూరమేనా వెళ్ళమన్నారు. నిక్షేపంలా భోజనాలూ పేరంటాలూ మానుకోడ మేమిటీ;" అని ఒక వృద్ధస్త్రీ సుద్దులు మొదలుపెట్టింది.

"అయినా ఆపిల్లనలా ఉంచేశారేమిటీ."

"అసలా పిల్లకి పెళ్లియోగం ఉందో లేదో" వీళ్లిలా మాట్లాడుకుంటోండగానే మగవాళ్ళ భోజనాలయిపోయినాయి, 'గోవిందో హరి' అంటూ వారంతా లేచారు.

రోజుకు రోజూ, చూచేవాళ్లకూ, బంధుగులకూ యీ సడింపు లెక్కువయాయి. దానితోపాటామె తండ్రి కూడా చాలా మార్లామె పెండ్లివిషయంలో ఎంతో బాధపడడంకూడా ఆమె యెరుగును.

ఓనాడు తల్లి నడిగింది అమాయికంగా 'అమ్మా! పెళ్లి లేకపోతేయేం!'

తల్లి ం కోపంతో యెర్రబారింది. 'ఇదిగో ఇలాగే నలుగురి నోళ్ళలోనూ పడిపోవాలి.'

"మరి నాతో చదువుకొనేవాళ్లుకొందరు కాలేజీల్లో చదువుతున్నారే."

"వాళ్ళు సమర్థులు. పట్టణాల్లో ఉంటారు. మనం అసమర్థులం; పల్లెటూరి వాళ్ళం..."

విమల కొక దెబ్బ కొట్టినట్లయింది. పల్లెటూరివాళ్ళకు చదువురాదు; పెళ్లి కాదు; దేవుడిపూజకు పనికి రారు. మనుష్యులకే కాదు దేవుడికి కూడాను పక్షపాతం...ఆమె కళ్ళవెంట అనుకోకుండా నీళ్ళు కారాయి.

పక్కింటివాళ్ళ పిల్లని పది వేలిస్తామంటూంటే వదులుకుని, జనార్దన రావంటివాడు విమలను పెళ్లిచేసుకుంటానని పట్టుబట్టాడంటే అందరికీ చాలా ఆశ్చర్యంగానే ఉంది. కారణమేమిటంటే జనార్దనరావు యూనివర్సిటీ డిగ్రీపొంది నెల కైదువందలు సంపాదిస్తూ పైకి వస్తూన్న వాడు. వాళ్ళది చాలా కలిగిన సంసారం. అతని కున్న అన్న ఒక్కడూ వకీలుగా పేరులో ఉన్నవాడు. అలాంటి వాడీ పల్లెపడుచును పెళ్ళాడగోరడం ఆశ్చర్యమే.

జనార్దనరావుకు అన్న చెప్పాడు 'పల్లెటూరిపిల్ల' అని. ఇంట్లో ఉన్న ముసలమ్మ అంది 'ఆపిల్ల యేమంత చక్కనిది కాదు.. నిక్షేపంలా బంతిపూవుల్లాంటి పిల్లలను కావలిసిన కట్నంతో కోరిన ముచ్చట్లతో చేస్తామంటూంటే...'

మధ్యలోనే అందుకున్నాడు జనార్దనరావు. 'అందం అనేది చూచేవాళ్ళ కళ్లల్లో ఉంటుంది. ఆ పిల్ల నాకళ్లకి చాలా బాగుంది. ఆమె కళోపాసన చాలా గొప్పది; మీకు తెలియదు.'

అతనికి కట్నాలిస్తామనే దగ్గర బంధుగుకు కూడా యిది కష్టంగానే తోచింది. చివరకొకామె అడిగిందా ముసలమ్మను 'మాపిల్లకేం లోటు; పదివేలిస్తామంటే; కాదంటే యింకో పదివేలు పెట్టగలం...'

ఆ ముసలమ్మకూడా ఏమనుకుందోగాని 'పెళ్లికూతుళ్లకు పెట్టని సొమ్ములు కొన్ని ఉంటేగాని పెట్టేసొమ్ములు రాణించవమ్మా; ఆ పిల్లేమో బాగా పాడుతుందిట. బాగాబొమ్మలు వేస్తుందిట...అందుకే మా వాడికి నచ్చింది...'

అనుకున్న ముహూర్తానికి విమల పెళ్ళి యథావిధిగా జరిగిపోయింది. రెండు రోజులాలస్యమైనా విమల పూజ చాలా మంచిదన్నారు చూచినవాళ్లు. సూరయ్యగారి ధర్మమే ఆయన్ని రక్షించింది అనుకున్నారూళ్ళో అందఱూ...'ఎలా వస్తే అలాఅనుకోడం లోకంపోకడ' అనుకుని నవ్వుకుందివిమల...

ఏడాదిలో తిరిగివచ్చింది మళ్ళీ తెప్ప తిరునాళ్ల ఉత్సవం...మంగళసూత్రం సౌభాగ్యంవల్ల దేవుని వెనకాలే దీపాలు వదలిపెట్టే అర్హత సంపాదించుకుందివిమల. ఆనాడా సౌభాగ్యాన్ని చూచి సంతోషించింది. చేయడాని కారాటపడింది. చేయలేకపోయానుకదా అని కన్నీరు కార్చింది.

ఇప్పుడు చేసి ఆనందంతో పరవశురాలైంది. 'కోరిక తీరిందా' అని జనార్దనరావామెను చిరునవ్వుతో పలకరించాడు. ★

---

భార్య: "ఏమండీ! ఏమగాడికైనా పెళ్ళి అంటూ అయన తరువాత నే తెలివితేటలు వస్తాయంటాను. మీరు ఏమంటారూ"

భర్త: "అవును ఆమాట నిజమే కానీ, మగవాడి జీవితంలో జరగవలసిన పొరపాటు ఏదో అప్పటికే జరిగిపోతుంది. అప్పుడు తెలివితేటలు వచ్చి ఏం ప్రయోజనం లే!"

* జీవితంలో నిరాశ! *

నరముల దౌర్బల్యంచేత కామేచ్ఛ. దాంపత్య సుఖంలేక నపుంసకత్వముచే జీవితంలో నిరాశ చెందిన వారికి నూతన దాంపత్య సుఖానందమిచ్చు అమోఘ పైపూత తైలము లామ్డా ఆయిల్. వృద్ధులున్నూ వాడవచ్చు. వెల బుడ్డిరూ. 4/8. చంద్రా భాను అండ్ కో., 27, ఓటు, మదరాసు-1

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, పవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.